క్లుప్తంగా

నేడు సత్యసాయి ఆలయ వార్షికోత్సవం

ఆసిఫాబాద్‌అర్బన్: భగవాన్ శ్రీ సత్యసాయి బాబా ఆలయ 9వ వార్షికోత్సవాన్ని జిల్లా కేంద్రంలోని గుండి రహదారి వద్ద సత్యసాయి సేవా సదన్ ఆవరణలో నిర్వహించనున్నట్లు సత్యసాయి సేవా సమితి ప్రతినిధులు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఉదయం 5 గంటలకు ఓంకారం, సాయి సుప్రభాతం, నగర సంకీర్తన, 6.30 గంటలకు ప్రశాంతి పతాకావిష్కరణ, 7 గంటల నుంచి 8 గంటల వరకు హారతి కర్పూర హోమం, మధ్యాహ్నం 1 గంట నుంచి 3 గంటల వరకు నారాయణ సేవ (అన్నప్రసాదము), రాత్రి 7 గంటల నుంచి సామూహిక భజన, మహా మంగళహారతి కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. వార్షికోత్సవ కార్యక్రమంలో సత్యసాయి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

ఇట్యాలలో 'పోషణ పక్షం'



మాట్లాడుతున్న అనసూర్య

దహెగాం: మండలంలోని ఇట్యాల గ్రామంలో గల అంగన్‌వాడీ కేంద్రం -1 లో సోమవారం పోషణ పక్షం వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులకు అన్నప్రాసన, గర్భిణీలకు సీమంతం చేశారు. అనంతరం సూపర్‌వైజర్ అనసూర్య మాట్లాడుతూ గర్భిణీలు, బాలింతలు పోషకాలు ఉన్న ఆహారం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త దీకొండ రమాదేవి, పంచాయతీ కార్యదర్శి సాయి పాల్గొన్నారు.

ఘనంగా శంకర్ మహాదేవుని జాతర



జాతరలో మొక్కులు చెల్లిస్తున్న భక్తులు

వాంకిడి: మండలంలోని బెండార గ్రామ శివారులో నిర్వహించిన శంకర మహాదేవుని జాతర ఉత్సవంలా జరిగింది. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. బెండార వద్ద వెలసిన శంకరుని ఆలయం వద్ద భక్తుల సందడి నెలకొంది. భక్తులు మొక్కులు తీర్చుకున్నారు.

ఘనంగా మహిళా దినోత్సవం



కేక్ కట్ చేస్తున్న వైద్య సిబ్బంది

దహెగాం: మండల కేంద్రంలోని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం మహిళా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా వైద్యాధికారిని స్పందన ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సంబరాలు జరిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

కెరమెరి: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో కృష్ణారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ పెందోర్ మోతిరాం అధ్యక్షతన ఉదయం 11 గంటలకు జరిగే కార్యక్రమానికి జెడ్పీటీసీ, వైస్ ఎంపీపీ, ఎంపీటీసీలు, గ్రామ పంచాయతీ ప్రత్యేకాధికారులు, వివిధ శాఖల అధికారులు సకాలంలో హాజరు కావాలని ఆయన పేర్కొన్నారు.

నేడు సమావేశం

వాంకిడి: మండల సర్వసభ్య సమావేశాన్ని మంగళవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో వి.వి వరలక్ష్మి తెలిపారు. మండల కేంద్రంలోని ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ముండె విమలబాయి అధ్యక్షతన నిర్వహించే కార్యక్రమానికి సంబంధిత శాఖల అధికారులు అభివృద్ధి నివేదికలతో ఉదయం 11 గంటల లోపు హాజరు కావాలని కోరారు.

నేడు ఉపాధి కల్పనపై అవగాహన

ఆసిఫాబాద్: తెలంగాణ రాష్ట్ర ఖాదీ, గ్రామీణ పరిశ్రమల మండలి జిల్లా శాఖ ఆధ్వర్యంలో ప్రధాన మంత్రి ఉపాధి కల్పనా పథకం(పీఎంఈజీపీ)పై మంగళవారం ఉదయం 11 గంటలకు రెబ్బెన మండల కేంద్రంలోని రైతు వేదికలో అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు ఆ శాఖ రీజనల్ అధికారిణి అనసూయ ఒక ప్రకటనలో తెలిపారు. నిరుద్యోగ యువత కార్యక్రమానికి హాజరై సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ప్రమాదకరంగా ప్రయాణం



అధ్వానంగా పంగిడిమాదర నుంచి లింగాపూర్‌కు వెళ్లే రోడ్డు

- జోరుగా ఇసుక ట్రాక్టర్ల రాకపోకలు
- అనుమతులు లేకుండా అధిక లోడ్‌తో వెళ్తున్న వాహనాలు
- ఇబ్బందులు పడుతున్న ఇతర వాహనదారులు
- పట్టించుకోని అధికారులు

తిర్యాణి: అధిక లోడుతో ఇసుక ట్రాక్టర్లు నడుస్తుండటంతో రోడ్లు అధ్వానంగా మారుతున్నాయి. మండలంలో 29 గ్రామపంచాయతీలు ఉండగా 120 అనుబంధ గ్రామాలు ఉన్నాయి. కాగా కనీస రోడ్డు సౌకర్యం లేని గ్రామాలు 40శాతానికి పైగా ఉండగా అంతంత మాత్రంగా ఉన్న రోడ్లు సైతం అధిక లోడుతో అక్రమంగా ఇసుక రవాణా చేస్తుండటంతో చెడిపోతున్నాయి. అయినప్పటికీ అక్రమ రవాణాకు అధికారులు అడ్డుకట్ట వేయడంలో విఫలమవుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇటీవల అనుమతులు లేకుండా పంగిడిమాదర గ్రామం మీదుగా లింగాపూర్ మండలానికి తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్లను పట్టుకొని జరిమానా విధించినప్పటికీ మరుసటి రోజు నుంచి మళ్లీ ట్రాక్టర్లలో ఇసుక రవాణా జరుగుతూనే ఉంది. ఇసుక దందా వెనుక ఆసిఫాబాద్ మండలానికి చెందిన ఒక మండల స్థాయి ప్రజాప్రతినిధి ఉన్నట్లుగా తెలుస్తోంది.

అడ్డుకట్ట వేసేది ఎప్పుడు..?

జిల్లాలోని లింగాపూర్, సిర్పూర్(యూ), జైనూర్ మండలాల్లో ఇసుక నిల్వలు తక్కువగా ఉన్నాయి. దీంతో ఆసిఫాబాద్ మండలంలోని చిర్రకుంట గ్రామంలో గల వాగు నుంచి నిత్యం పదుల సంఖ్యలో ట్రాక్టర్ల ద్వారా మండలంలోని పంగిడిమాదర మీదుగా లింగాపూర్ మండలానికి ఇసుకను తరలిస్తున్నారు. ఇప్పటికే రోడ్డు తారు లేచి ఉండటం.. దీనికి తోడు రోజుకు 20 నుంచి 50 ట్రాక్టర్లు నడుస్తుండటంతో రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారింది. కాగా కొంతమంది ట్రాక్టర్ యజమానులు ఎలాంటి అనుమతులు లేకుండానే ఇసుక రవాణా చేస్తున్నట్లు సమాచారం. దీంతో పంగిడిమాదర గ్రామం నుంచి దాంపూర్, కొటగాం, లింగాపూర్, సిర్పూర్(యూ) గ్రామాలకు వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్డుపై ప్రయాణం ప్రమాదకరంగా మారింది. వాహనాలు అదుపుతప్పి కింద పడి గాయాల పాలైన సంఘటనలు సైతం అనేకం ఉన్నాయి. అయినప్పటికీ అంతంత మాత్రంగా ఉన్న రోడ్డుపై ఇసుక లోడ్‌తో వెళ్తున్న ట్రాక్టర్ల రాకపోకలపై అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు.

అధికారులు చర్యలు తీసుకోవాలి



ఆసిఫాబాద్ మండలంలోని చిర్రకుంట వాగు నుంచి పంగిడిమాదర మీదుగా లింగాపూర్ మండలానికి ఇసుక తరలించకుండా అధికారులు చర్యలు చేపట్టాలి. రాత్రి, పగలు అనే తేడా లేకుండా ఇసుక ట్రాక్టర్లు నడుస్తుండటంతో రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. తిర్యాణి నుంచి పంగిడిమాదర మీదుగా లింగాపూర్ వెళ్లాలంటే కనీసం ద్విచక్ర వాహనాలు కూడా రోడ్డుపై వెళ్లలేని పరిస్థితి ఉంది.

– కోట్నాక గణపతి, ఆదివాసీ సేన జిల్లా అధ్యక్షుడు

నిర్మించారు.. నిర్లక్ష్యంగా వదిలేశారు



నిరుపయోగంగా ధరణి కార్యాలయం



ప్రారంభానికి ముందే పగిలిన కిటికీ అద్దాలు

లింగాపూర్: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాల పక్కన గత ఏడాది రూ. 20 లక్షల నిధులతో ధరణి కార్యాలయ భవనం నిర్మించారు. కానీ నేటికీ ప్రారంభించకపోవడంతో భవనం నిరుపయోగంగా మారింది. ప్రారంభానికి ముందే కిటికీల అద్దాలు, తలుపులు పగలడంతో అధికారుల తీరుపై విమర్శలు వస్తున్నాయి. లక్షల రూపాయల ప్రజా ధనం వృథా కావడంపై 'సాక్షి' తహసీల్దార్ బాబు రాజేంద్రప్రసాద్‌ను వివరణ కోరగా భవన నిర్మాణ సమయంలో తాము లేమని, భవనంతో తమకు ఎలాంటి సంబంధం లేదని నిర్లక్ష్యంగా సమాధానమిచ్చారు.

సీసీరోడ్ల నిర్మాణానికి భూమిపూజ



రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న నాయకులు

పెంచికల్‌పేట్: మండలంలోని జైహింద్‌పూర్, పోతెపల్లి గ్రామాల్లో జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో మంజూరైన రోడ్ల నిర్మాణ పనులను సోమవారం ప్రారంభించారు. జైహింద్‌పూర్‌లో రూ.10లక్షలు, పోతెపల్లిలో రూ.5లక్షలతో పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు ఉపాసీ సంజీవ్, దాసరి చంద్రమౌళి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బోయిరె బండు, లస్మయ్య, మహిళా నాయకురాలు సబా, గ్రామస్తులు పాల్గొన్నారు.

గిరిజన గ్రామాల అభివృద్ధికి కృషి

- ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

నార్నూర్: గిరిజన గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తానని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. సోమవారం గాదిగూడ మండలంలో పర్యటించారు. మారేగావ్ నుంచి మేడిగూడ వరకు, అలాగే పావునుర్ లొద్దిగూడ గ్రామానికి బీటీరోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. పిప్రి గ్రామాన్ని సందర్శించి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆసిఫాబాద్ నియోజకవర్గ ప్రజలు ఆశీర్వదించి భారీ మెజార్టీతో గెలిపించినప్పటికీ బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి రాలేదన్నారు. ప్రధాన ప్రతిపక్షంలో ఉండి నియోజకవర్గ అభివృద్ధికి చిత్తశుద్ధితో పని చేస్తానన్నారు. ప్రతీ గిరిజన గ్రామానికి రోడ్డు, మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమంపై దృష్టి సారించాలన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో పని చేసే నాయకులను ఎన్నుకోవాలన్నారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలను అమలు చేయకుండా కాలయాపన చేస్తుందని మండిపడ్డారు. కార్యక్రమంలో ఎంపీపీ ఆడ చంద్రకళ రాజు, వైస్ ఎంపీపీ యోగేష్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పూసం బాదిరావు, ఉర్వేత రుప్‌దేవ్, సామాజిక కార్యకర్త మెస్రం శేఖర్, జర్రి గ్రామపటేల్ సోము, తదితరులు పాల్గొన్నారు.

జోరుగా బోర్ల తవ్వకం

- నిబంధనలు పాటించని రైతులు, ప్రైవేట్ వ్యక్తులు
- తవ్వుతున్న వాటిలో 30శాతమే సక్సెస్
- అవగాహన కల్పించడంలో అధికారులు విఫలం



కౌటాలలో ఓ ప్రైవేటు భూమిలో వేస్తున్న బోర్ (ఫైల్)

కౌటాల: సాగు, తాగునీటి అవసరాల కోసం రైతులు, ఇతరులు ఇష్టారాజ్యంగా బోర్లు వేస్తున్నారు. భూగర్భంలో నీటి లభ్యతను పరిగణనలోకి తీసుకోకుండా వందల ఫీట్ల లోతు వరకు తవ్వుతున్నారు. ఇలా డ్రిల్లింగ్ చేసిన వాటిలో 70శాతానికి పైగా విఫలమవుతున్నాయి. ఈ క్రమంలో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. అవగాహన కల్పించాల్సిన అధికారులు ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు.

అవసరానికి మించి..

నీటి లభ్యత, వాడకంపై అవగాహన లేని కొంత మంది రైతులు పంటలకు అవసరానికి మించి నీరందిస్తున్నారు. దీంతో నీటి కొరత ఏర్పడుతుండడంతో బోర్లు తవ్వాలని ఆరాటపడుతున్నారు. బోరు వేసేందుకు నిపుణులైన జియాలజిస్టులను సంప్రదించకుండా బాబాలు, గురువులను ఆశ్రయిస్తున్నారు. టెంకాయ, తంగెడు పుల్లలతో అశాస్త్రీయ పద్ధతులను అవలంబిస్తూ అప్పుల పాలవుతున్నారు. బోరులో నీళ్లు రాకపోవడంతో ఆర్థికంగా నష్టపోయి అవస్థలు పడుతున్నారు. బోర్‌వెల్ యజమానులు ఎలాంటి అనుమతులు లేకుండా ఒక్కో బోరు బావిని దాదాపు 200 మీటర్ల లోతు వరకు తీస్తున్నారు. అందుకు రూ. 50వేల నుంచి రూ. 60 వేల వరకు డబ్బులు తీసుకుంటున్నారు.

పరీక్షలకు స్వస్తి..

భూగర్భ జలాల లభ్యతపై ప్రతీ మండలంలో అధికారులు ఏటా పరీక్షలు నిర్వహించాలి. ఆయా ప్రాంతాలను బట్టి, అంతకు ముందు నమోదైన వర్షపాతంపై ఆధారపడి భూగర్భ జలమట్టం మారుతుంది. నీటి లభ్యత పరీక్షల అనంతరం, అధికారులు తక్కువ నీళ్లున్న గ్రామాల జాబితాను విడుదల చేయాల్సి ఉంటుంది. తక్కువ ఉన్న జీపీల్లో కొత్త బోరుబావుల తవ్వకాన్ని నిషేధించాల్సి ఉంది. కానీ కొన్నేళ్లుగా అసలు ఈ పరీక్షలే నిర్వహించడం లేదు. నిబంధనల ప్రకారం బోర్లు, బావులు తవ్వాలంటే రెవెన్యూ అధికారుల అనుమతి తప్పనిసరి. మీ సేవ ద్వారా చలానా తీసి రెవెన్యూ అధికారులు, రక్షిత మంచినీటి శాఖ అధికారుల ధ్రువీకరణ పొందాల్సి ఉంటుంది. నీటి లభ్యత వంద గజాల దూరంలో ఉంటేనే అనుమతి ఇస్తారు. అనుమతి లేకుండా బోర్లు వేస్తే రూ. లక్ష జరిమానాతో పాటు వాహనాన్ని సీజ్ చేసే అవకాశం ఉంది.

అనుమతులు తీసుకోకుండానే..

భూగర్భ జలాలు అడుగంటుతున్న నేపథ్యంలో అత్యవసరమైతే తప్పా బోరుబావులు తవ్వకూడదు. రాష్ట్రంలోని ఇతర జిల్లాల నుంచి బోరు లారీలు వచ్చి మండలాల్లోని ఆయా గ్రామాల్లో జోరుగా అనుమతి లేకుండా బోర్లు వేస్తున్నారు. కానీ సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో బోర్లు వేసే యజమానులు ఎక్కడ పడితే అక్కడ బోర్లు వేస్తూ డబ్బులు సంపాదించుకుంటున్నారు. అధికారులు స్పందించి అనుమతుల్లేని బోరు తవ్వకాలు నియంత్రించి రాబోయే తరాలకు నీటి కరువు లేకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

సంబురంగా పాఠశాల వార్షికోత్సవం



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

వాంకిడి: మండలంలోని ఖమాన గ్రామంలో గల ప్రాథమికోన్నత పాఠశాల వార్షికోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు పాటలపై నృత్యాలు చేస్తూ అలరించారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులకు ఉన్నత విద్యపై అవగాహన కల్పించారు. ప్రతీ విద్యార్థి జీవిత గమ్యాలను ఏర్పర్చుకోవాలని సూచించారు. ప్రధానోపాధ్యాయుడు ప్రదీప్, సిబ్బంది స్రవంతి, ప్రవీణ్, అశ్విని, అభిలాష్, రవి, రంజిత, వందన పాల్గొన్నారు.

'కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం'



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

కౌటాల: కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమని కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు కస్తూరి సత్యనారాయణ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్టీసీ సిబ్బంది జీతాలు పెంచడంతో మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం కౌటాల ఆర్టీసీ బస్టాండ్ ఎదుట ఆర్టీసీ కార్మికులతో కలిసి నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు భట్టి విక్రమార్క, పొన్నం ప్రభాకర్‌ల చిత్ర పటాలకు క్షీరాభిషేకం చేశారు. బ్లాక్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సంతోష్, మండలాధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు దేవయ్య, హన్మంతు, వీరయ్య, రవి, వంశీ, ఇస్తార్, కాళిదాస్, బాలస్వామి, జ్ఞానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంతోనే ఆరోగ్యం

ఆదిలాబాద్‌టౌన్: పోషకాహారంతోనే ఆరోగ్యంగా ఉంటారని సుందరయ్యనగర్ అంగన్‌వాడీ కేంద్రం టీచర్ రాధ అన్నారు. పోషణ పక్షోత్సవాల కార్యక్రమాన్ని సోమవారం అంగన్‌వాడీలో నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పోషక ఆహార పదార్థాలను అందించడం జరుగుతుందన్నారు. గర్భిణులు, ప్రొటీన్లు, మిటమిన్లతో కూడిన ఆహారం తీసుకోవడంతో పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. పోషకాహార లోపంతో పిల్లల్లో ఎదుగుదల లోపిస్తుందన్నారు. అనంతరం కాలనీలో బతుకమ్మ, బోనాలతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ పోషక విలువ గురించి వివరించారు. కార్యక్రమంలో ఆర్పీ ఫరీదా, ఉజ్మా, జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

బజార్‌హత్నూర్: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని గిరిజన క్రీడా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గొడం చందన్ అన్నారు. సోమవారం మండలంలోని జాతర్ల గ్రామంలో నిర్వహించిన అంతర్రాష్ట్ర క్రీడా పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు ప్రదానం చేశారు. వాలీబాల్ ప్రథమ బహుమతి కిన్వట్, ద్వితీయ బహుమతి మంచిర్యాల్, కబడ్డీ పోటీలలో ప్రథమ బహుమతి ఆదిలాబాద్, ద్వితీయ బహుమతి కిన్వట్ జట్లు గెలుచుకున్నాయి. కార్యక్రమంలో ప్యాక్స్ చైర్మన్ మేకల వెంకన్న, ఎంపీటీసీ పెందూర్ ఈశ్వర్, మాజీ ఎంపీపీ నాగోరావ్, మాజీ జెడ్పీటీసీ బలిరాం, ప్రధానోపాధ్యాయులు పెందూర్ సుదర్శన్, మడవి కృష్ణరావ్, రవీందర్, ప్రకాష్, గంగారాం, నానం రమణ, అల్కే గణేష్ పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ధ్యేయం

నేరడిగొండ: పేదల సంక్షేమమే ధ్యేయమని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. మండల కేంద్రంలోని ఆయన నివాసంలో సోమవారం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని వర్గాల ప్రజలకు సమాన సంక్షేమ పాలన అందించిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ రాథోడ్ సజన్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ సాబ్లే నానక్‌సింగ్, వీడీసీ చైర్మన్ ఏలేటి రవీందర్ రెడ్డి, తహసీల్దార్ సంతోష్ రెడ్డి, ఆర్ఐ నాగోరావు, రాథోడ్ సురేందర్, గులాబ్ సింగ్, లింబాజీ, కరణ్ పాల్గొన్నారు.

పోరాటాలతోనే సమస్యల పరిష్కారం

ఆదిలాబాద్‌టౌన్: పోరాటాలతోనే సమస్యలు పరిష్కారం అవుతాయని ప్లంబర్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు సందర్ల నర్సింగ్ అన్నారు. జిల్లా కేంద్రంలో ప్లంబర్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా కేక్‌కట్ చేసి పంచిపెట్టారు. అందరు కలిసికట్టుగా సమస్యల సాధన కోసం పోరాడితేనే పరిష్కరం అవుతాయన్నారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట నారాయణ, రామోజివార్ దేవిదాస్, హరీష్, మడావి గణేష్, అజయ్, అజీమ్, జాఫర్, శేషరావు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతి



వినతిపత్రం అందజేస్తున్న ఉద్యోగులు, కార్మికులు

కాగజ్‌నగర్‌రూరల్: గ్రామపంచాయతీ ఉద్యోగ, కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సోమవారం ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబుకు వారు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు నగేశ్ మాట్లాడుతూ గ్రామపంచాయతీ ఉద్యోగ, కార్మికులకు గత ఐదు నెలల నుంచి ఏడు నెలల వరకు వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. మల్టీపర్పస్ వర్కర్ విధానంతో ఉద్యోగ భద్రత కార్మికులు కోల్పోయారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన 9,500 రూపాయల వేతనం అందరికీ రావడంలేదని పేర్కొన్నారు. వెంటనే పెండింగ్‌లో ఉన్న బకాయిలు చెల్లించే విధంగా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు మురళీ, నగేశ్, లక్ష్మణ్, రాజన్న, వేణుగోపాల్, రాజు తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ పండుగకు వసతులు కల్పించాలి

ఆసిఫాబాద్: రంజాన్ పండగకు జిల్లాలోని ముస్లింలకు ప్రత్యేక వసతులు కల్పించాలని ముస్లిం వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రంలో కలెక్టర్ వెంకటేశ్ దోత్రేకు వినతిపత్రం అందించారు. ఏటా ప్రభుత్వం రంజాన్ పండుగ సందర్భంగా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తుందని పేర్కొన్నారు. ఈ సారి కూడా విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని, వసతులు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం ప్రతినిధులు ఎజాజ్ అహ్మద్, ముబష్షీర్, ఖలీల్, అఫ్జల్, ఎజాజ్ ఉన్నారు.

కుష్ఠు సర్వే పకడ్బందీగా నిర్వహించాలి

నార్నూర్: ఇంటింటా కుష్ఠు సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని పీహెచ్‌సీ వైద్యాధికారి రాంబాబు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో వైద్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈనెల 11 నుంచి 24 వరకు కుష్ఠుపై ప్రభుత్వం ఇంటింటా సర్వే చేయడం జరుగుతుందన్నారు. ఈ వ్యాధి లక్షణాలు బయటపడేందుకు 5 సంవత్సరాలు పడుతుందన్నారు. హెల్త్ సూపర్‌వైజర్ చౌహాన్ చరణ్‌దాస్, రాజమ్మ, ఏఎన్‌ఎంలు ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

సమయపాలన పాటించాలి



విద్యార్థులను ప్రశ్నలు అడుగుతున్న ఎంఎన్‌వో

కెరమెరి: టీచర్లు సమయ పాలన పాటించాలని ఎంఎన్‌వో ఆడే ప్రకాశ్ అన్నారు. సోమవారం మండలంలోని చౌపన్‌గూడ, రింగన్‌ఘాట్, కొఠారి, కల్లెగాం, సావర్‌ఖేడా పాఠశాలలను ఆయన సందర్శించారు. ఈసందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు పరిశీలించారు. ఉపాధ్యాయులు డైరీలు రాయాలని సూచించారు. విద్యార్థులు బాగా చదువుకోవాలన్నారు. హెచ్‌ఎంలు వనిత, కిషన్, సరిత, దివ్యశ్రీ, రంగయ్య ఉన్నారు.